సాక్షి ఒడిశా

సోమవారం । 23 । అక్టోబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం

నగదు రూ.473675
బంగారం: 21 గ్రాముల 90 మిల్లీగ్రాములు
వెండి: 8 గ్రాములు – భువనేశ్వర్/పూరీ



నకిలీ గుట్కా తయారీ గుట్టురట్టు!

నకిలీ గుట్కా తయారు చేస్తున్న ఫ్యాక్టరీపై పోలీసుల దాడులు చేశారు. ఇద్దరి అరెస్టు చేసి సామగ్రి సీజ్ చేశారు.

-IIలో▸



యువత క్రీడల్లో రాణించాలి

యువత క్రీడల్లో రాణించాలని బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు ఆకాంక్షించారు. ఆదివారం రాయగడ ప్రీమియర్ క్రికెట్ లీగ్‌ను ఆయన ప్రారంభించారు.

-IIలో▸

న్యూస్‌రీల్

వ్యక్తి దారుణ హత్య!

- మృతదేహాన్ని ఆస్పత్రి ఆవరణలో పడేసిన వైనం



అశోక్ బొరాడ్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుమారుడు లోకేష్

రాయగడ: వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. అతని మృతదేహాన్ని ఆస్పత్రి ప్రాంగణంలో పడేసి వెళ్లిపోయారు. ఈ సంఘటన రాయగడ జిల్లా గుణుపూర్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. మృతుడు గజపతి జిల్లా పర్లాకిమిడిలోని కటక్ వీధికి చెందిన అశోక్ బొరాడ్ (53)గా పోలీసులు గుర్తించారు. వివరాల్లోకి వెళితే.. అశోక్ బొరాడ్ గుణుపూర్‌లోని రైల్వేస్టేషన్‌లో వాటర్ సప్లయ్ విభాగంలో విధులు నిర్వహిస్తుండేవారు. శనివారం పర్లాకిమిడిలో నివసిస్తున్న తన కొడుకు లోకేష్‌కు ఫోన్ చేసి 35 వేల రూపాయలు తీసుకొనిరమ్మని.. ఆ డబ్బులను ఒకరికి అప్పుతీర్చాలని చెప్పాడు. దీంతో కుమారుడు సొమ్ముతో గుణుపూర్‌కు బయలుదేరాడు. రాత్రి తొమ్మిది గంటలయ్యేసరికి గుణుపూర్ చేరుకున్న లోకేష్‌కు రైల్వేస్టేషన్‌లో కొంతమంది నీతండ్రి మృతదేహం ఆస్పత్రిలో పడిఉందని చెప్పారు. దీంతో పరుగున అక్కడకు వెళ్లిన లోకేష్ తండ్రి అశోక్ బొరాడ్ మృతదేహం చూసి కన్నీరు మున్నీరయ్యాడు. వెంటనే విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన తండ్రిని ఎవరో హత్య చేసి ఉంటారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వృద్ధులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేయాలి

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని దర్శనానికి ఇటీవల వరుస వ్యవస్థ ప్రవేశ పెట్టారు. అయితే నిర్వహణ లోపం కారణంగా పలు సమస్యలు తలెత్తుతున్నాయి. పలు వర్గాల ఒత్తిడితో దివ్యాంగుల కోసం ప్రత్యేక దర్శన సదుపాయం కల్పించారు. ఈ నేపథ్యంలో వృద్ధులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వయో వృద్ధుల సమాఖ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. దర్శనం కోసం ఆలయ సముదాయంలోకి ప్రవేశించే ముందు వృద్ధులు మూడు, నాలుగు గంటల పాటు క్యూలో నిల్చోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలియజేసింది. సులభ దర్శనం కోసం ప్రత్యేక స్లాట్ కేటాయించాలని డిమాండ్ చేసింది.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

- జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్



అల్ట్రాసౌండ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: ప్రజలకు ఆల్ట్రా సౌండ్ తదితర వైద్య పరీక్షలు ఉచితంగా లభ్యమౌతాయని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి వెల్లడించారు. బొరిగుమ్మలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆల్ట్రాసౌండ్ యంత్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్యూనిటీ ఆస్పత్రిలో ఇప్పటి వరకూ ఆల్ట్రాసౌండ్ మిషన్ సౌకర్యం లేకపోవడంతో రోగులు ఇబ్బందిపడేవారన్నారు. అవసరమైన వారు జయపురం, నవరంగపూర్, కొరాపుట్ పట్టణాల్లోని ఆస్పత్రులకు వెళ్లి.. అధిక డబ్బులు చెల్లించి పరీక్షలు పరీక్షలు చేయించుకునేవారన్నారు. ఈ సమస్యను తాను విధానసభలో ప్రస్తావించడంతో బొరిగుమ్మ ఆస్పత్రికి ఆల్ట్రాసౌండ్ యంత్రం మంజూరైందని చెప్పారు. యంత్రంతోపాటు దాన్ని ఆపరేట్ చేసేందుకు ఓ ఉద్యోగిని కూడా నియమించినట్లు చెప్పారు. ఈ ప్రాంతీయులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ అరుణకుమార్ పాఢి, జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రి అధికారి డాక్టర్ రబినారాయణ మిశ్ర, బొరిగుమ్మ సర్పంచ్ తుషార్ కాంత కుమ్రిక తదితరులు పాల్గొన్నారు.




అల్ట్రాసౌండ్ యంత్రాన్ని ఆపరేట్ చేస్తున్న బాహిణీపతి

జయ జయహే.. మహిషాసుర మర్దిని!

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారు ఆదివారం మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. దసరా పూజలు చివరి దశకు చేరుకోవడంతో పలుచోట్ల ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయాలు, మండపాలు, పీఠాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరుతున్నారు. – సాక్షి నెట్‌వర్క్



రాయగడ: మహిషాసుర మర్దినిగా అమ్మవారు



రాయగడ:లక్ష నాణేలతో అర్చనలు



రాయగడ: కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజలు



రాయగడ: మజ్జిగౌరి మందిరంలో కలశ పూజలు



పర్లాకిమిడి: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో కోలాట ప్రదర్శన



జయపురం: జయపురం ఉత్సవాల్లో కొలువుదీరిన మాపెంద్రాని దేవి



జయపురం: పెద్ద బజార్ మార్కెట్ జంక్షన్‌లో పూజలందుకుంటున్న దుర్గాదేవి



జయపురం: టాటా బెంజి జంక్షన్‌లో కొలువుదీరిన అమ్మవారు



పర్లాకిమిడి: చండీయోగంను నిర్వహిస్తున్న ఎరుకోల కృష్ణారావు దంపతులు



పర్లాకిమిడి: కటికవీధి జంక్షన్‌లో దుర్గాదేవికి పూజలు



భువనేశ్వర్: జాజ్‌పూర్ వైభవ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అష్ట భుజ వ్యాఘ్ర వాహినిగా దుర్గామాత



భువనేశ్వర్: జాజ్‌పూర్ విరజా శక్తి పీఠంలో దక్షిణ కాళీ స్వరూపంలో..



భువనేశ్వర్: మహిషాసుర మర్దిని అలంకరణలో చర్చికా మాత



మల్కన్‌గిరి:మార్కెట్ వద్ద కొలువుదీరిన దుర్గాదేవి



జయపురం: ఆకట్టుకున్న బాజా భజంత్రీలు



జయపురం: ప్రయివేట్ బస్టాండ్‌లో అలంకరణలో కనకదుర్గ



జయపురం: పవర్ హౌస్‌లో ప్రత్యేక అలంకరణలో దుర్గా దేవి



బొయిపరిగుడలో పూజలందుకుంటున్న దుర్గాదేవి



మల్కన్‌గిరి: డీఎన్‌కే కూడలి వద్ద దుర్గామాత విగ్రహం

కొలిక్కిరాని 'పేపర్‌మిల్లు' చర్చలు

- విభిన్న అభిప్రాయాలు వ్యక్తం చేసిన కార్మిక సంఘ నాయకులు
- మధ్యలో వెళ్లిపోయిన యాజమాన్య ప్రతినిధులు



సమావేశంలో పాల్గొన్న శ్రామిక, యాజమాన్య ప్రతినిధులు

జయపురం: జయపురంలోని గగణాపూర్ సేవా పేపరు మిల్లులో శ్రామిక అశాంతి కొనసాగుతోంది. యాజమాన్యం తమకు బకాయి ఉన్న నాలుగు నెలల జీతాన్ని వెంటనే చెల్లించటంతో పాటు 2012, 2015 త్రైపాక్షిక ఒప్పందాలను అమలు చేయాలని శ్రామిక యూనియన్లు డిమాండ్ చేస్తూ ఆందోళన చెపట్టిన విషయం విదితమే. ఈ సమస్యను పరిష్కరించాలని జిల్లా లేబర్ అధికారులు ఆదివారం మిల్లులో నాలుగు శ్రామిక యూనియన్ల ప్రతినిధులను, మిల్లు యాజమాన్య ప్రతినిధులతో సమావేశం నిర్వహించి చర్చించారు. రెండు నెలల వేతనాన్ని నెలరోజుల్లో చెల్లిస్తామని మిల్లు యజమాన్య ప్రతినిధులు హామీ ఇచ్చారు. అయితే ఈ షరతును నాలుగు యూనియన్లలో రెండు యూనియన్ల ప్రతినిధులు అంగీకరించలేదు. మిగతా రెండు యూనియన్ల ప్రతినిధులు వెంటనే మిల్లు పని చేసేందుకు చర్యలు తీసుకోవాలని.. తమ సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. అయితే నాలుగు సంఘాల మధ్య సమన్వయం లేక పోవటంతో తాము హైదరాబాద్‌లో ఉన్న ఉన్నతాధికారులకు విషయాన్ని తెలియజేస్తామన్నారు. మరోసారి సమావేశం ఏర్పాటు చేస్తామని.. అందుకు కొంత సమయం కావాలని చెప్పి యాజమాన్య ప్రతినిధులు వెళ్లిపోయారు. దీంతో ఎటువంటి నిర్ణయం తీసుకోలేక అర్ధాంతరంగా సమావేశం ముగిసింది. సహాయ లేబర్ కమిషనర్ నరేంద్రరాయిక అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో.. మరో సహాయ లేబర్ కమిషనర్ ప్రసన్న పాణిగ్రహి, జిల్లా లేబర్ అధికారి బృంధావణ సెట్టి, మిల్లు యాజమాన్య ప్రతినిధులు ఎం.కె.గుప్త, ఎస్.ఎస్.పాల్, రమేష్ యాదవ్ పాల్గొనగా.. శ్రామిక యూనియన్ల నాయకులు ప్రమోద్ మహంతి, ప్రదీప్ పంజియ, సరోజ్ సువార్, బంశీధర మహంకుడొ, బాలకృష్ణ ప్రధాన్, ఎం.సత్యనారాయణ హాజరయ్యారు.

కొండచిలువ కలకలం



కొండచిలువను పట్టుకున్న స్నేక్ హెల్ప్‌లైన్ బృందం

బరంపురం: బరంపురం సమీపంలోని దాస్‌పూర్ గ్రామంలో పది అడుగుల కొండచిలువ శనివారం రాత్రి కలకలం సృష్టించింది. గ్రామస్తులు పొలానికి వెళ్తుండగా కొండచిలువ తారసపడింది. దీంతో గ్రామస్తులు భయాందోళనలతో బరంపురం అటవీ అధికారులకు సమాచారం అందించారు. అటవీఅధికారి రంజిత్ మిశ్రా ఆధ్వర్యంలోని బృందం సంఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే అప్పటికే కొండచిలువ సమీపంలోని ఓ చెట్టుపైకి ఎక్కేసింది. దీంతో అటవీ సిబ్బంది బరంపురంలోని స్నేక్ హెల్ప్‌లైన్ సమాచారం ఇవ్వగా.. ఆ సంస్థ ప్రతినిధి సంతున్ సాహు బృందం అక్కడికి చేరుకున్నారు. చాకచక్యంగా కొండచిలువను పట్టుకుని కిరండమల్ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

సైకత దుర్గ



దసరా సందర్భంగా పూరీ సాగర తీరంలో అద్భుత సైకత శిల్పం సందర్శకులు, పర్యాటకుల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది. అంతర్జాతీయ సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ ఇసుక, 2,000 పైబడి ప్రమిదల్ని వినియోగించి దసరా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆకర్షణీయంగా దుర్గాదేవిని తీర్చిదిద్దారు.

– భువనేశ్వర్/పూరీ

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



వీరభద్రస్వామికి జ్ఞాపిక అందజేస్తున్న శంకరశర్మ

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, లుకలాపు గోవిందరావులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు.

అరసవల్లిలో ప్రత్యేక పూజలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీ నవరాత్రులు సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి అయ్యప్పస్వాములు, భవానీ భక్తులు పెద్ద సంఖ్యలో ఆదిత్యున్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆరోగ్యం కోసం సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.1,26,400, విరాళాల ద్వారా రూ.74,954, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.75 లక్షలు వరకు ఆదాయం లభించినట్లు అధికారులు తెలిపారు.

కారు ఢీకొని యువకుడికి గాయాలు

నందిగాం: మండలంలోని సుభద్రాపురం గ్రామానికి చెందిన పాలిన జయరాం జాతీయ రహదారిని దాటుతుండగా కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జయరాం ఆదివారం ఉదయం రోడ్డు దాటుతుండగా పలాస నుంచి టెక్కలి వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కాలు విరగడంతో బాధితుడ్ని టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. నందిగాం ఎస్సై మహమ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాతపట్నంలో కొత్త రైల్వేగేటు



కొత్త గేటు నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

పాతపట్నం: స్థానిక నీలమణిదుర్గ ఆలయం సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఉన్న గేటును తొలగించి పక్కనే కొత్త గేటు ఏర్పాటు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం కొత్త గేటు కోసం రైల్వే ట్రాక్ వద్ద గేటు స్టాండ్, కేబుల్ వర్క్ పనులు చేపట్టారు. రైల్వే ఫ్లై ఓవర్ పనుల్లో భాగంగా హైవే సిబ్బంది, రైల్వే సిబ్బంది కలిసి ఈ పనులు చేపడుతున్నారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హైవే అధికారి రామకృష్ణ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

టెక్కలి రూరల్: మండలంలోని గూడెం పంచాయతీ సవరకిల్లి గ్రామ సమీప తోటల్లో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. 11 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.21150 నగదు స్వాధీనం చేసుకున్నట్లు టెక్కలి ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు.

కవలలకు జన్మనిచ్చి గర్భిణి మృతి

బూర్జ : మండలంలో నీలాదేవిపురం గ్రామానికి చెందిన వావిలపల్లి భాగ్యలక్ష్మి (43) ప్రసవానంతరం శ్రీకాకుళం ప్రైవేటు ఆస్పత్రిలో ఆదివారం సాయంత్రం మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. భాగ్యలక్ష్మి హైరిస్క్ గర్భిణి కావడంతో నెలలు నిండిన తర్వాత డెలివరీ కోసం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ 17న సిజేరియన్ చేశారు. కవల పిల్లలు పుట్టారు. ఇంతలో పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. ఈమెకు భర్త నీలకంఠ ఉన్నారు. భాగ్యలక్ష్మి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కిడ్నీ వ్యాధితో యువకుడు మృతి



మృతుడు రాజారావు (ఫైల్)

వజ్రపుకొత్తూరు: మండలంలో పెద్దబొడ్డపాడు పంచాయతీ సీతాపురం గ్రామానికి చెందిన తమ్మినాన రాజారావు(35) కిడ్నీ సమస్యతో బాధపడుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఈయన కొన్నాళ్లుగా పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు పొందుతున్నాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈయనకు భార్య సునీత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు, గ్రామస్తులు కోరుతున్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



బ్యాటింగ్ చేస్తున్న నెక్కంటి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

రాయగడ: యువత క్రీడల్లో రాణించాలని, అందుకు ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తోందని మాజీ ఎంపీ, బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు అన్నారు. స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో రాయగడ ప్రీమియర్ క్రికెట్ లీగ్ ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నెక్కంటి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి ఎంతో ప్రాధాన్యమిస్తోందని తెలియజేశారు. ఇండోర్ స్టేడియంలు ఏర్పాటు చేస్తోందన్నారు. యువత క్రీడలతో పాటు చదువుల్లోనూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ముందుగా నెక్కంటి బ్యాటింగ్ చేయగా, బీజేడీ జిల్లా కార్యదర్శి దూడల శ్రీనివాస్ బౌలింగ్ చేసి లీగ్‌ను ప్రారంభించారు. ఈ లీగ్‌లో మొత్తం పది జట్లు పాల్గొనగా, 50 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుందని నిర్వాహకులు తెలియజేశారు. లీగ్ విన్నర్ జట్టుకు రూ.44,444, రన్నర్ జట్టుకు రూ.33,333 నగదు బహుమతిని అందజేస్తామని తెలియజేశారు.

త్వరితగతిన పూర్తి చేయండి



సాగర్‌లో తిరిగి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి తదితరులు

జయపురం: స్థానిక చారిత్రాత్మక జగన్నాథ్ సాగర్ పారిశుద్ధ్య పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సాగర్ పరిశుభ్రతా పనులను ఆదివారం సమీక్షించారు. సాగర్‌ను పరిశుభ్రపరచే అధునాతన యంత్రంపై సాగర్ అంతా తిరిగి పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తవ్వకపోవడంతో బాహిణీపతి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల 5టీ కార్యదర్శి జగన్నాథ్ సాగర్‌ను సందర్శించి సాగర్ పునరుద్ధరణ పనులకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ప్రకటించారు. దీంతో ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వానికి గుర్తు చేయాలని బాహిణీపతి సూచించారు.

ఇంటర్ స్టేట్ క్రికెట్ పోటీల విజేత శ్రీకాకుళం



ట్రోఫీతో విజేత శ్రీకాకుళం జట్టు

గార: మండలంలోని కె.మత్స్యలేశం పంచాయతీ క్రీడా మైదానంలో నిర్వహించిన ఇంటర్‌స్టేట్ క్రికెట్ టోర్నమెంట్ (20-20)లో శ్రీకాకుళం జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్లో హైదరాబాద్ జట్టుపై విజయకేతనం ఎగురవేసింది. రెండు రాష్ట్రాల నుంచి ఆరు జట్లు ఈ టోర్నీలో పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా జశ్వంత్ (శ్రీకాకుళం), మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డును క్రిస్టఫర్ (హైదరాబాద్), చరిత్ (శ్రీకాకుళం)లు గెలుచుకున్నట్లు ప్రకటించారు. బెస్ట్ బౌలర్లుగా ఆకాష్, భరత్, వరుణ్ అవార్డులు అందుకున్నారు. వీటిని బుద్ధా స్కూల్ చైర్మన్ బి.ఎర్రన్న, విశాఖపట్నం సీఐ ఇలియాస్ అహ్మద్, శైలేంద్ర అందజేశారు. కార్యక్రమంలో బత్తుల గోవింద, కిరణ్, సురేష్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు



కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

బరంపురం: గంజాం జిల్లాలోని ఛత్రపూర్ పట్టణంలో జరుగుతున్న మా రవణమ్మ నవరాత్రి ఉత్సవాలకు భక్తులు పోటెత్తుతున్నారు. ఆదివారం అష్టమి సందర్భంగా అమ్మవారి మందిర ప్రాంగణంలో వందలాది మంది తెలుగు మహిళలు సామూహిక కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు చేపట్టారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్



గాజులకొల్లివలసలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మండలం గాజులకొల్లివలసలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ నవ భారత రాజ్యాంగ నిర్మాతగా ఉంటూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం శ్రమించిన వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. ప్రపంచ దేశాల్లో భారత్‌ను అగ్రరాజ్యంగా నిలబెట్టాలనే లక్ష్యంతో రాజ్యాంగాన్ని రూపొందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మొండేటి కూర్మారావు, జెడ్పీటీసీ బెండి గోవిందరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బోసు మన్మథరావు, నత్తల కృష్ణ, దళిత సంఘం నాయకులు కళ్లేపల్లి రామ్‌గోపాల్, కంఠం వేణు, టింగ రాజు, సవలాపురపు రాజా, సుజాత, యశోదమ్మ, రాజు, కో ఆర్డినేటర్లు నవిరి ప్రసాద్, నవిరి రవి, నవిరి రమేష్, సనపాపురపు కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు బొడ్డేపల్లి రాజశేఖర్, కామిరెడ్డి రమణ, పేడాడ శ్యామ్‌సుందర్, గొంటి కృష్ణ, దుంపల శ్యామలరావు, సురవరపు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య నేర్పాలి



శ్యామలను సత్కరిస్తున్న హిందీ మంచ్ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: పిల్లలకు విలువలతో కూడిన విద్య నేర్పాలని సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, విశ్రాంత డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు అన్నారు. హిందీ మంచ్, తెరవే, పెన్షనర్ల సంక్షేమ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఈఎండీపీ టాపర్, గణిత ఉపాధ్యాయిని డి.శ్యామలను ఆదివారం శ్రీకాకుళంలో సన్మానించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పారిశ్రామిక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం కోర్సులో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న విశాఖ జిల్లాకు చెందిన శ్యామల అభినందనీయురాలని కొనియాడారు. హిందీ మంచ్ ఉత్తరాంధ్ర కన్వీనర్ కోనె శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 9వ తరగతి విద్యార్థులకు ప్రవేశపెట్టిన ఎంటర్‌ప్రిన్యూర్‌షిప్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కోర్సులో విశాఖ జీవీఎంసీ టీచర్‌గా విశేష ప్రతిభ కనబరచి, విద్యార్థులను రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు తీసుకువెళ్లారని తెలిపారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత, శ్యామల, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన హిందీ మంచ్ జిల్లా కార్యదర్శి రొంపివలస రామారావులను సత్కరించారు. కార్యక్రమంలో హిందీ మంచ్ అధ్యక్షుడు దొంతం పార్వతీశం, సీనియర్ ఉపాధ్యాయ సంఘం నేత ఎం.నీలాద్రిరావు, బి.ఉమామహేశ్వరరావు, మోహనరావు, వజ్రాల భగత్, కనుగుల సత్యం, గాంధీ, తెరవే సంస్థ ప్రతినిధులు ఇద్ది పాపయ్య, తంగి ఎర్రమ్మ, ఐఎన్‌డీ ప్రసాద్, మంగిపూడి శ్రీనివాసరావు, కథా నిలయం తరపున దాసరి రామచంద్రరావు, ఇస్కాఫ్ ప్రతినిధి ఎం.వి.మల్లేశ్వరరావు, పెన్షనర్ల సంఘం ప్రతినిధి దుర్గరాజు, జలుమూరు సత్యం, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి మజ్జి రామారావు పాల్గొన్నారు.

అట్టాడ అప్పలనాయుడుకు సత్కారం



అప్పలనాయుడును సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు, వైఎస్సార్ జీవితకాల సాఫల్య పురస్కారానికి ఎంపికైన ప్రసిద్ధ కథ, నవలా రచయిత అట్టాడ అప్పలనాయుడుకు న్యాయవాద, జర్నలిస్టు సంఘాల నేతలు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాషా వికాసానికి కృషి చేస్తున్న అప్పలనాయుడుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపిక చేయడం సముచితమన్నారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యాలను ప్రజలు ఆదరించాలని, ప్రభుత్వాలు ప్రోత్సాహం అందించాలని కోరారు. కథలు, కవితలు, పద్యాలు, నవలలను పెద్దలతో పాటు పిల్లలూ చదివేలా ప్రోత్సహించాలన్నారు.కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణచంద్, జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బెజ్జిపురపు ఫల్గుణరావు, ఉత్తరాంధ్రా జర్నలిస్టుల ఫ్రంట్ అధ్యక్షుడు చౌదరి లక్ష్మణరావు, ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఆగూరు ఉమామహేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు మామిడి క్రాంతి, కూన అన్నంనాయుడు, కడగల రాంబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టులో వికృత ప్రవర్తన

- ఇద్దరు అరెస్టు

భువనేశ్వర్: ఒరిస్సా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి వద్ద అసభ్యంగా ప్రవర్తించడం, అవమానకరమైన పదజాలం ఉపయోగించడం, న్యాయ నిర్వహణకు ఆటంకం కలిగించినందుకు ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. కోణార్క్‌లో కేటాయించిన స్థలంలో కోర్టు ఆఫ్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) నిర్మాణాన్ని సవాలు చేస్తూ ప్రభాత్‌కుమార్ పాఢి, ఇతర గ్రామస్తులు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) కోర్టు విచారిస్తున్నప్పుడు ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రభాత్ కుమార్ హాజరై తన లాయర్‌ను మార్చేందుకు అనుమతి కోరారు. అయితే, పెండింగ్‌లో ఉన్న కేసులన్నింటినీ సుప్రీంకోర్టు పరిష్కరించినందున, హైకోర్టు తీర్పు ఇవ్వాల్సినది ఏమీ లేదని కోర్టు అతనికి తెలియజేసింది. పిటిషనర్ ఈ సందర్భంగా అహంకారంగా ప్రవర్తించాడు. తనతో సహా గ్రామస్తుల నుంచి అనుమతి పొందితే తప్ప రిట్ పిటిషన్‌ను ఉపసంహరించుకోలేనని చెప్పాడు. తోటి గ్రామస్తులతో మాట్లాడేందుకు అనుమతించడంతో ప్రభాత్ కుమార్ పాఢి కోర్టు గది నుంచి బయటకు వెళ్లి దుర్యోధన్ సాహు అనే వ్యక్తితో తిరిగి వచ్చి గలాటా సృష్టించాడు. అహంకార ధోరణితో దురుసుగా ప్రవర్తిస్తూ న్యాయస్థానాన్ని కించపరిచేలా వ్యవహరించడంతో న్యాయస్థానం చర్యలకు ఆదేశించింది. ప్రభాత్ కుమార్ పాఢి, దుర్యోధన్ సాహు కోర్టు ధిక్కారానికి పాల్పడటంతో నిర్బంధంలోకి తీసుకున్నారు. దుర్గా పూజా సెలవుల అనంతరం కోర్టు తిరిగి తెరిచేవరకు (అక్టోబర్ 30) వరకు వారిని జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించారు. చౌద్వార్ సర్కిల్ జైలు సూపరింటెండెంట్ ద్వారా ఏడు రోజులలోపు తమ వివరణ ప్రత్యుత్తరాన్ని దాఖలు చేసే అవకాశం నిందితులకు కల్పించారు.

నకిలీ గుట్కా తయారీ గుట్టురట్టు!



అరెస్టయిన వ్యక్తులు

- ఫ్యాక్టరీపై పోలీసుల దాడులు
- సామగ్రి సీజ్ • ఇద్దరి అరెస్టు



పోలీసులు సీజ్ చేసిన గుట్కా తయారీ సామగ్రి

బరంపురం: నకిలీ గుట్కాను తయారు చేస్తున్న ఫ్యాక్టరీపై బరంపురం పోలీసులు ఆదివారం దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా తయారీకి ఉపయోగించే వివిధ సామగ్రిని సీజ్ చేశారు. ఇద్దరిని అరెస్టు చేశారు. బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. గోళంతరా పోలీసుస్టేషన్ పరిధిలో ఆంధ్ర–ఒడిశా సరిహద్దు సూర్లా రోడ్ జంక్షన్‌లో ఎటువంటి లైసెన్స్ లేకుండా కొంత మంది నకిలీ గూట్కా ను తయారు చేసే పరిశ్రమను కొద్దికాలంగా రహస్యంగా నడుపుతున్నారు. విషయం తెలుసుకున్న గోళంతరా పోలీసులు ఆకస్మికంగా దాడులు చేపట్టి నకిలీ గుట్కాను, తయారు చేసేందుకు వినియోగించే సామగ్రి, యంత్రాలు, నకిలీ లేబుల్స్‌ను సీజ్ చేశారు. ఈ ఘటనలో ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్పీ చెప్పారు. అరెస్టయిన వారిలో బరంపురం నగరం గాంధీనగర్‌కి చెందిన శ్రీకాంత్‌దాస్, గొళంతరా గ్రామనికి చెందిన సంతోష్ మాహారణ ఉన్నారన్నారు.

ఉద్దానం కొబ్బరికి ఉత్తరాది దెబ్బ

- నార్త్ ఇండియాలో తగ్గిన డిమాండ్
- దిగజారుతున్న ధరలు
- ఎగుమతుల్లో దూసుకుపోతున్న తమిళనాడు



కంచిలి వ్యాపార కేంద్రంలో కొబ్బరికాయల నిల్వలు

కంచిలి: ఉద్దానం కొబ్బరి రైతుల్లో దసరా సందడి కనిపించడం లేదు. నానాటికీ దిగజారుతున్న కొబ్బరి ధరలు రైతులను నిరాశకు గురి చేస్తున్నాయి. ఉత్తరాంధ్రలోనే పేరొందిన కంచిలి కొబ్బరి మార్కెట్‌లో దసరా, దీపావళి వ్యాపార లావాదేవీల సందడి ఈ ఏడాది కన్పించడం లేదు. ఉద్దానంతో పాటు కోనసీమ కొబ్బరికాయలకు ఉత్తరాది రాష్ట్రాల్లో డిమాండ్ తగ్గడమే ఇందుకు కారణం. ఉద్దాన ప్రాంతంగా పిలిచే టెక్కలి డివిజన్‌లోని ఏడు మండలాలతోపాటు రణస్థలం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం మండలాల్లో కలిపి సుమారు 36 వేల ఎకరాల్లో విస్తారంగా సాగుచేస్తున్న కొబ్బరి ఎగుమతి అవ్వాలంటే కంచిలి కేంద్రంగానే వ్యాపార లావాదేవీలు సాగుతుండేవి. ఏటా అక్టోబర్‌లో భారీ ఎత్తున క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. దసరా నవరాత్రి ఉత్సవాలు, దీపావళి పండగ సందర్భంగా ఉత్తరాది రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున చేపట్టే దుర్గా పూజలకు, బీహార్ రాష్ట్రంలో జరుపుకునే 'ఛట్ పూజ'కు కొబ్బరికాయలకు డిమాండ్ ఉంటుంది. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, హర్యానా, బీహార్, ఒడిశా తదితర రాష్ట్రాలకు ఇక్కడి నుంచే కొబ్బరి కాయలు ఎగుమతి చేస్తుంటారు. ఈసారి మాత్రం కంచిలి మార్కెట్‌లో ఆ పరిస్థితి కన్పించడం లేదు.

తమిళనాడుకే ప్రాధాన్యం..

ఉద్దానం కొబ్బరికి దీటుగా దక్షిణాదిన తమిళనాడులో కొబ్బరి సాగు వృద్ధి చెందింది. దీంతో ఉత్తరాది రాష్ట్రాలు కొబ్బరిని కొనుగోలు చేసేటప్పుడు అన్ని మార్కెట్లు పరిశీలిస్తున్నారు. నాణ్యత, కాయ పరిమాణం, ధరలను పోల్చి తమిళనాడు వైపే మొగ్గు చూపుతున్నారు. అక్కడ సాగు విస్తీర్ణం పెరగడంతో ఉత్తరాది మార్కెట్‌కు పెద్ద ఎత్తున ఎగుమతులు చేస్తున్నారు. వెయ్యికాయలు రూ.10వేలు వరకు ధర పలుకుతున్నాయి. ఇక్కడ ధరలు మాత్రం ఆశాజనకంగా లేవు. గత నెల వరకు వెయ్యి కాయలు రూ.8వేలకు మించి పలకలేదు. దసరా పుణ్యమా అని ప్రస్తుతం వెయ్యి కాయలు రూ.11వేలకు చేరాయి. అయినా ఉత్తరాది రాష్ట్రాలు కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదు. గత ఏడాది ఈ సీజన్‌లో వెయ్యి కాయల ధర రూ.15వేలు వరకు ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు.

తగ్గిన ఎగుమతులు..

గతంలో ఈ సీజన్‌లో రోజుకు 40 నుంచి 50 లారీల కొబ్బరి ఉత్తరాదికి ఎగుమతి అయ్యేది. ప్రస్తుతం ఉత్తరాదికి ఎగుమతులు నిలిచిపోయాయి. కేవలం ఒడిశా మార్కెట్‌కే కాయలు తరలుతున్నాయి. ప్రస్తుతం తోటల నుంచే ఒడిశా వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు తప్ప కంచిలి మార్కెట్‌కు రావడం లేదు. దీంతో ఉద్దానంతో పాటు మిగతా మండలాల్లో కొబ్బరి రైతులు ఒడిశా, మిగతా చిల్లర మార్కెట్‌పైనే ఆధారపడాల్సి వస్తోంది.



కాయలు ఒలుస్తున్న కూలీలు

ఆశాజనంగా లేవు..



ఏటా దసరా, దీపావళి సీజన్‌లో అయ్యే ఎగుమతులు ఈ ఏడాది లేవు. ఉద్దానంలో కొబ్బరి సాగు బాగున్నా ధరలు పతనమయ్యాయి. ఉత్తరాది మార్కెట్‌లో ఇక్కడి కాయలకు డిమాండ్ తగ్గింది. తమిళనాడులో ఇంతకన్నా చవగ్గా లభ్యం కావడంతో, ఉత్తరాది వ్యాపారులు ముఖం చాటేస్తున్నారు.

– నరేష్‌కుమార్ అగర్వాలా(లల్లూ), కొబ్బరి వ్యాపారి, కంచిలి

నిస్తేజంగా రైతులు..



దసరా పండగ సందడి కొబ్బరి రైతుల ముఖంలో కనిపించడం లేదు. దిగుబడులు మాట ఎలా ఉన్నప్పటికీ ధరలు ఆశాజనకంగా లేవు. దీంతో రైతు దిగాలు చెందుతున్నారు. గత ఏడాదితో పోల్చితే ధర బాగా పడిపోయింది. ఈ పరిస్థితిలో రైతుకు ఏం చేయాలో పాలుపోవడం లేదు.

– పొందల ఢిల్లీరావు, రైతు, సర్పంచ్, పెద్దకొజ్జిరియా గ్రామం

• అరుణవర్ణ శోభితం



సూర్యాస్తమయం వేళ ఎంతో నిర్మలంగా ఉండే వినీలాకాశం ఒక్కసారిగా ఎరుపెక్కింది. ఆదివారం సాయంత్రం ఆకాశం అరుణ వర్ణంలోకి మారి కనువిందు చేసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ వేడిమి, ఉక్కపోతకు గురిచేసిన సూరీడు సాయంత్రం మేఘాల చాటుకు వెళ్లిపోవడంతో ఇచ్ఛాపురం వాసులు తమ సెల్‌ఫోన్‌లలో ఈ రమణీయ దృశ్యాన్ని బంధించారు.

– ఇచ్ఛాపురం రూరల్

క్లుప్తంగా

380 మద్యంసీసాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంసీసాలను చూపిస్తున్న పోలీసులు

గుర్ల: మండలంలోని కెల్ల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి దగ్గర నుంచి 380 మద్యంసీసాలను పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకే ఆకస్మిక దాడులు నిర్వహించి, మద్యం విక్రేతను అరెస్ట్ చేయడంతో పాటు మద్యంబాటిళ్లను పట్టుకున్నామని ఎస్ఐ హరి బాబునాయుడు తెలిపారు. గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు, పేకాట శిబిరాలు నిర్వహించినా సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

వినతిపత్రం అందజేత



ఏఐఎస్ఎఫ్ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం ఫూల్‌బాగ్: ఎంసెట్, ఈసెట్ మూడో విడత కౌన్సెలింగ్ తక్షణమే చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరుతున్నారు. ఇదే విషయమై వారు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను నగరంలో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగభూషణం మాట్లాడుతూ తొలి రెండు విడతల్లో జరిగిన కౌన్సెలింగ్ దూరప్రాంత కాలేజీల్లో సీట్లు పొందిన విద్యార్థులంతా తమకు దగ్గరలోని కాలేజీలో సీటు పొందేందుకు మూడో విడత కౌన్సెలింగ్ కోసం వేచి చూస్తున్నారని తెలిపారు. స్పాట్ అడ్మిషన్ల పేరిట అర్హులైన విద్యార్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి.గౌరీశంకర్, పట్టణ కార్యదర్శి ఎ.సుమన్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్ట్

విజయనగరం క్రైమ్: దిశ మహిళా పోలీస్ సెల్‌ఫోన్ లాక్కొని, పరారైన దొంగను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి.. దిశ పోలీస్‌స్టేషన్‌లో హెచ్‌సీగా విధులు నిర్వహిస్తున్న దివ్యజ్యోతి విధులు ముగించుకుని, స్టేషన్ బయటకు రోడ్డు వైపు వస్తుండగా బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమె చేతిలోని సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యాడు. అప్రమత్తమైన ఆమె వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశా రు. ఈ మేరకు పోలీసులు అతడి కోసం గాలింపు చ ర్యలు చేపట్టగా, కలెక్టరేట్ వెనుక ఉన్న ప్రాంతంలో అతడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. పూ ల్‌బాగ్‌కి చెందిన కోట అమరనాథ్ అనే వ్యక్తిగా అత డిని గుర్తించారు. చెడు వ్యసనాలకు బానిస కావడంతో ఇలా దొంగతనాలకు పాల్పడుతున్నాడని దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



చెరువులో తేలియాడుతున్న వ్యక్తి మృతదేహం

తెర్లాం: మండలంలోని గొలుగువలస గ్రామానికి సమీపంలోని లింగిభేరివాని చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు ఆదివారం గుర్తించి, పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అక్కడి మృతదేహం పరిశీలించి, పరిస్థితిని సమీక్షించారు. మృతుడి వివరాలు తెలియరావాల్సి ఉందని, మృతుడు ఎరుపురంగు షర్టు, నల్లరంగు ప్యాంటు వేసుకున్నాడని, ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఇన్‌చార్జ్ ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు. శవపంచనామా అనంతరం పోస్టుమార్టం కోసం బాడంగి సీహెచ్‌సీకి మృతదేహం తరలించామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమ్స్ అండ్ మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన వెనుకబడిన/ఆర్థికంగా బలహీన వర్గాల అభ్యర్థులకు ప్రోత్సాహకంగా రూపొందించిన 'జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం' నూతన పథకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ మరియు సాధికారత అధికారిణి పి.రత్నం ఆదివారం తెలిపారు. ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన వారికి రూ.లక్ష నగదు ప్రోత్సాహకం, మెయిన్స్‌లో అర్హత సాధించిన వారికి రూ.50 వేలు నగదు ప్రోత్సాహకం ఈ పథకం ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. 'జన్మభూమి.ఏపీ.జీఓవి.ఐఎన్' పోర్టల్‌లో అందించిన వెబ్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో నవంబర్ 4వ తేదీలోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ ప్రకటనలో సూచించారు.

ఘనంగా క్రీడోత్సవం ప్రారంభం

- 8 రోజుల పాటు.. 16 క్రీడాంశాల్లో పోటీలు
- తొలిరోజు ఉత్సాహంగా వాక్ ఫర్ హెల్త్ పోటీలు
- పైడితల్లమ్మ జాతర, విజయనగరం ఉత్సవాల్లో భాగంగా నిర్వహణ



క్రీడోత్సవానికి ముస్తాబైన రాజీవ్ స్టేడియం ప్రాంగణం



వాక్ ఫర్ హెల్త్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న సెట్విజ్ సీఈవో రామగోపాల్

విజయనగరం: విజయనగరం వైభవం ఉట్టిపడేలా నిర్వహించే పైడితల్లమ్మ జాతరకు అనుబంధంగా చేపట్టే విజయనగరం ఉత్సవాల సందడి ఇప్పటికే ఆరంభం కాగా, ఇందులో భాగంగా స్థానిక సర్ విజ్జీ స్టేడియంలో క్రీడోత్సవం ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. క్రీడల ఖిల్లాగా పేరొందిన విజయనగరం జిల్లాలో క్రీడాకారుల ప్రతిభాపాటవాలను వెలికితీసి, వారిని ప్రోత్సహించేందుకు పలు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. మొత్తం 8 రోజుల పాటు 16 క్రీడాంశాల్లో సెట్విజ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఉదయం వాక్ ఫర్ హెల్త్ పేరిట 40 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు వారికి 1 కిలోమీటరు వాకింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. 23న రాజీవ్ క్రీడామైదానంలో ఇదే కేటగిరీలో వాకింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. 25న కంటోన్మెంట్ ప్రాంతంలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో స్విమ్మింగ్ పోటీలు, 26, 27వ తేదీల్లో రాజీవ్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు, 26, 27, 28వ తేదీల్లో సర్ విజ్జీ స్టేడియంలో క్రికెట్ పోటీలు, 26, 27వ తేదీల్లో రాజీవ్ స్టేడియంలో ఖోఖో పోటీలు, 28వ తేదీన రాజీవ్ స్టేడియం నుంచి సైకిల్ ర్యాలీ, అయోధ్య మైదానంలో హాకీ పోటీలు నిర్వహించనున్నారు.

అయ్యకోనేరులో వాటర్ స్పోర్ట్స్..

29వ తేదీన రాజీవ్ స్టేడియంలో గాలిపటాలు ఎగురవేసే పోటీలు, అయ్యకోనేరులో వాటర్ స్పోర్ట్స్ పోటీలు నిర్వహిస్తారు. 29, 30వ తేదీల్లో రాజీవ్ స్టేడియం వేదికగా కబడ్డీ, వాలీబాల్ పోటీలు.. 30వ తేదీన రాజీవ్ స్టేడియంలో ఫ్లయింగ్ ఆఫ్ బెలూన్స్, తైక్వాండో, ఫెన్సింగ్, కరాటే, రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, సంగిరాళ్ల పోటీలు జరగనున్నాయి. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు ఈ నెల 25వ తేదీలోగా రాజీవ్ స్టేడియంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు ఉచితంగా భోజనం, వసతి సదుపాయాలు కల్పించనుమని సెట్విజ్ సీఈవో బి.రామగోపాల్ తెలిపారు.

రేపటి నుంచి క్రికెట్ సెమీఫైనల్స్



సెమీఫైనల్‌కు అర్హత సాధించిన మహారాష్ట్ర జట్టు

- ముగిసిన అండర్-19 మహిళల అంతర్‌రాష్ట్ర క్వార్టర్ ఫైనల్స్
- తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు ఓటమి
- సెమీస్ బరిలో బరోడా, తమిళనాడు, ముంబై, మహారాష్ట్ర జట్లు

విజయనగరం: జిల్లా వేదికగా ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-19 మహిళల అంతర్‌రాష్ట్ర క్వార్టర్ ఫైనల్స్(మ్యాచ్‌లు) ఆదివారంతో ముగిశాయి. మొత్తం నాలుగు వేదికల్లో వన్డే తరహాలో హోరా హోరీగా సాగిన మ్యాచ్‌లలో నాలుగు జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయి. అతి థ్య ఆంధ్రా జట్టుతో పాటు మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, హర్యానా జట్లు ఓటమిని చవిచూడగా.. బరోడా, తమిళనాడు, ముంబై, మహారాష్ట్ర జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయి. ఈ నెల 24 నుంచి సర్ విజ్జీ స్టేడియం, డెంకాడ మండలంలోని చింతలవలసలో ఉన్న డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్ కాంప్లెక్స్ మైదానాల్లో జరిగే సెమీఫైనల్స్‌లో ఈ నాలుగు జట్లు తలపడనున్నాయి. ఆదివారం పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ క్రికెట్ మైదానంలో మధ్యప్రదేశ్, బరోడా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో బరోడా జట్టు 41 పరుగుల తేడాతో విజయం సాధించగా.. సర్ విజ్జీ స్టేడియంలో ఆంధ్రా-తమిళనాడు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు జట్టు 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఎంవీజీఆర్ కళాశాల మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో హర్యానా జట్టుపై మహారాష్ట్ర జట్టు 99 పరుగుల తేడాతో గెలుపొందగా.. కందుకూరి క్రికెట్ అకాడమీలో జరిగిన మరో మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్ జట్టుపై ముంబై జట్టు 5 వికెట్ల తేడాతో జయకేతనం ఎగురవేసింది.

'కోట'లో ఎంపిక పోటీలు

శృంగవరపుకోట: స్కూల్ గేమ్స్ అండర్-14, అండర్-17 బాలురు, బాలికల బ్యాడ్మింటన్ పోటీలకు సంబంధించి, స్థానిక శిరికి రిసార్ట్స్ ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల కో-ఆర్డినేటర్ పి.శ్రీరాములు ఆదివారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల నుంచి 180 మంది బాలురు, బాలికలు ఈ క్రీడాపోటీలకు హాజరవుతున్నారని, క్రీడాకారులకు భోజనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు విశాఖపట్నంలో త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో మన జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఎంపిక పోటీలకు వచ్చే వారు క్రీడాదుస్తులు, షూస్, రాకెట్లు ఎవరివి వారే తెచ్చుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 7989199534, 9490265104ను సంప్రదించాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న డీఎఫ్‌వో ప్రసూన

పార్వతీపురం టౌన్: పార్వతీపురం అటవీ శాఖ పరిధిలోని బేస్ క్యాంపు ఉద్యోగిగా పనిచేస్తూ మృతి చెందిన కోటేశ్వరరావు భార్య వరలక్ష్మికి రూ.55,000 ఆర్థికసాయాన్ని డీఎఫ్‌వో జి.ఎ.పి.ప్రసూన ఆదివారం అందజేశారు. అటవీ శాఖ అసోసియేషన్ నుంచి సాయం అందించామని డీఎఫ్‌వో తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వ పరంగా రావాల్సిన పరిహారం అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీ రేంజ్ అధికారులు, సెక్షన్ అధికారి మనోజ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



పీఎం పాలెం: ఘటన స్థలంలో మృతి చెందిన హేమలత

పీఎం పాలెం: ఎండాడ దిశ పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గేదెల హేమలత(32) అనే మహిళ దుర్మరణం చెందింది. ఈ ఘటన ఉదయం 8.30 గంటల సమయంలో చోటుచేసుకుంది. పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. విజయనగరం జిల్లాలోని గజపతినగం మండలం, మరుపల్లికి చెందిన హేమలత భర్త రైల్వే ఉద్యోగి కాగా, తన ఇద్దరు పిల్లలతో కలిసి మధురవాడలో నివసిస్తోంది. నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువును చూసేందుకు వరసకు సోదరుడైన యర్రా నారాయణరావుతో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. దిశ పోలీస్‌స్టేషన్ ఎదురుగా వచ్చేసరికి అదే రోడ్డులో విజయనగరం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వెనక కూర్చొని ఉన్న హేమలత ఒక్కసారిగా కిందపడడంతో ఆమె తలకు తీవ్రగాయమైంది. దీంతో సంఘటన స్థలంలోనే ప్రాణాలు విడిచింది. వాహనం నడుపుతున్న నారాయణరావుకు గాయాలు కాగా, గీతం ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మహిళ మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి భర్త రైల్వే ఉద్యోగి. నారాయణరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ సునీత కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శృంగవరపుకోట: విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ దొంతల ఈశ్వరరావు అనే వ్యక్తి శనివారం రాత్రి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని పెదఖండేపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరరావు కొన్నాళ్లుగా మద్యానికి బానిస కావడంతో ఈ నెల 20వ తేదీన అతడి భార్య మద్యం తాగొద్దని మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన అతడు ఇంట్లోని పురుగుమందు తాగి, ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు దగ్గరలోని ఆస్పత్రికి తరలించి, చికిత్స అందజేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడే చికిత్స పొందుతూ చనిపోయాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్.కోట ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు.

దండోరా..

- ఈ నెల 30న తొలేళ్లు, 31న సిరిమానోత్సవం
- ఉత్సవ చాటింపు వేసిన తలయారులు
- అమ్మవారి పండగకు తరలిరండి : ఈఓ



ఆలయం బయట పండుగ చాటింపు వేస్తున్న ఆలయ సిబ్బంది, ఆలయ తలయారీ

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా అమ్మవారి పండగ చాటింపు ప్రక్రియను ఆదివారం సాయంత్రం స్థానిక మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి ఆవరణలో వేడుకగా నిర్వహించారు. ఆలయ తలయారి చిన రామవరపు పైడిరాజు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మనవి చెప్పిన అనంతరం ఆలయ ఆవరణలో ఈఓ కెఎల్.సుధారాణి నేత్రత్వంలో దండోరా వేయించారు.

ఈ నెల 30న తొలేళ్ల సంబరాలు, 31న సిరిమానోత్సవం నిర్వహిస్తున్నామ న్నారు. కార్యక్రమంలో సిరిమాను పూజారి బంటు పల్లి వెంకటరావు, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పైడితల్లి అమ్మవారి పండగను విజయవంతం చేయాలని, పండగకు భక్తులందరూ తరలివచ్చి ఆ తల్లి దివ్యాశీస్సులు అందుకోవాలని ఆలయ ఈఓ కెఎల్ సుధారాణి కోరారు.

29, 30వ తేదీల్లో ఉత్తరాంధ్ర స్థాయి కబడ్డీ టోర్నీ

- విజేతలకు రూ.65 వేల నగదు ప్రోత్సాహకం
- జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్



మాట్లాడుతున్న జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్

విజయనగరం: విజయనగరం ఉత్సవాలు, శ్రీపైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు పురస్కరించుకుని, ఈ నెల 29, 30వ తేదీల్లో ఉత్తరాంధ్ర స్థాయి సీనియర్ పురుషుల కబడ్డీ టోర్నమెంట్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్ తెలిపారు. నగరంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సెట్విజ్ సీఈవో బి.రాంగోపాల్‌తో కలిసి మాట్లాడిన ఆయన మంత్రి బొత్స సత్యనారాయణ, శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుల ప్రోత్సాహంతో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. విజయనగరం రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఫ్లడ్ లైట్ల వెలుగులో, మ్యాట్‌పై పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.30 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.20 వేలు, తృతీయ బహుమతి కింద రూ.10 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నామన్నారు. ఆసక్తి గల జట్లు ఈ నెల 26వ తేదీలోగా తమ ఎంట్రీలను పంపాలని కోరారు. క్రీడాకారులకు భోజనం, వసతి సదుపాయాలు కల్పించనున్నామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9573363564, 8074858972ను సంప్రదించాలని కోరారు. సమావేశంలో కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కె.సూరిబాబు, క్రీడా సంఘాల ప్రతినిధులు బి.రామారావు, డి.అచ్యుతరావు, కె.ఎ.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి జిల్లా జట్ల ఎంపిక పోటీలు

- వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, స్విమ్మింగ్ క్రీడాంశాల్లో పోటీలు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న 67వ స్కూల్ గేమ్స్ పోటీలకు సంబంధించి, అండర్-14, అండర్-17 విభాగాల బాల,బాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 25, 26, 27వ తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్.వి.రమణ ఆదివారం తెలిపారు. ఈ నెల 25న విజయనగరం జిల్లా కేంద్రంలోని కంటోన్మెంట్ ప్రాంతంలోని ఆక్వా స్విమ్మింగ్ పూల్‌లో అండర్-14, అండర్-17 బాల,బాలికల విభాగాల్లో స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు జరుగుతాయని, 26న ఎస్.కోటలోని సిరికి రిసార్ట్స్‌లో అండర్-14, అండర్-17 బాల,బాలికల షటిల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు, 27న కొత్తవలసలో అండర్-14 బాల,బాలికల విభాగాల్లో వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నిర్ణీత వయసు కలిగి, ప్రస్తుతం పాఠశాల విద్యనభ్యసిస్తున్న వారంతా ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. జిల్లా జట్లకు అర్హత సాధించే క్రీడాకారులు త్వరలో రాష్ట్ర స్థాయిలో జరగబోయే అంతర్‌జిల్లాల పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'ఆపస్' నూతన కార్యవర్గం ఏర్పాటు



ప్రమాణ స్వీకరణ చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

విజయనగరం అర్బన్: స్థానిక సేవాభారతి కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) నూతన కార్యవర్గం ఏర్పాటు ఆదివారం జరిగింది. సభ్యులు జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా వి.వి.జె.సుబ్రహ్మణ్యం, గౌరవాధ్యక్షుడిగా వి.వి.శ్రీహరి ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఎ.జి.తాతారావు, ఉపాధ్యక్షులుగా వి.సత్యనారాయణ, ఎం.వెంకటనాయుడు, కె.భాస్కరరావు, ఎం.రమణ, ఎన్.వి.ఎస్.కృష్ణారావు, కె.సంతోషలక్ష్మి, కార్యదర్శులుగా సి.హెచ్.సోమయాజులు, ఆర్.అప్పలనాయుడు, డి.సోమిరాజు, కె.సాయికుమార్, ఎ.కృష్ణవేణి, ఎ.కిరణ్‌కుమార్, కార్యవర్గసభ్యులుగా పి.వి.గణపతిరావు, పి.సత్యారావు, సి.హెచ్.పద్మలత, కె.నాగరాజు, పి.శ్రీరంగాచార్యులు ఎన్నికయ్యారు. అనంతరం కొత్త కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల అధికారిగా ఆర్.ఎస్.ఎస్ విభాగ్ సంఘ్ చాలక్ మాననీయ డి.వి.వి.కృష్ణంరాజు వ్యవహరించారు. కార్యక్రమంలో సంఘ పూర్వ అధ్యక్షుడు ఇ.రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సభ ఏర్పాట్ల పరిశీలన



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: నవంబరు 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న బీసీ సాధికారిత బస్సుయాత్ర నేపథ్యంలో పార్వతీపురం నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్ సీపీ భారీ బహిరంగ సభ సోమవారం నిర్వహించనున్నారు. ఈ సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆదివారం పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. సభకు వచ్చే వారికి ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని, తాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ముఖ్య అతిథులుగా ఈ సమావేశానికి హాజరై, పార్టీ శ్రేణులను దిశానిర్దేశం చేయనున్నారు. దాదాపు ఆరు వేల మందికి పైగా పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు సభకు హాజరుకానున్నారని సమాచారం.

చెరకు క్రషింగ్‌కు సన్నద్ధం

ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో ఈ నెల 25 నుంచి క్రషింగ్ ప్రారంభం కానుంది. ఈ సీజన్‌లో 4.50 లక్షల టన్నుల చెరకును క్రషింగ్ చేయాలని యాజమాన్యం లక్ష్యంగా పెట్టుకుంది. అదే సమయంలో టన్నుకు మద్దతు ధర గత సీజన్ కంటే ఈ సీజన్‌లో రూ.100 లు పెంచి రైతులకు తీపి కబురు కర్మాగార యాజమాన్యం అందించింది.

- ఈ నెల 25 నుంచి ప్రారంభం
- 4.50 లక్షల టన్నుల క్రషింగ్ లక్ష్యం
- సిద్ధమైన సంకిలి ప్యారీ షుగర్స్
- టన్నుకు రూ.3080లు ధర చెల్లింపు
- ఎకరాకు 30 టన్నుల వరకు దిగుబడి
- విజయనగరంతో పాటు పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో సాగు చేస్తున్న చెరకు సేకరణ
- మొత్తం 7,500 హెక్టార్లలో చెరకు సేకరణకు కసరత్తు
- రైతులకు కటింగ్ ఆర్డర్లు మంజూరీ
- మార్చి వరకు క్రషింగ్ నిర్వహణ



వన్నలి సమీపంలో చెరకు పంట

ప్యారీ కర్మాగారం పరిధిలో గత ఐదేళ్లలో చెరకు మద్దతు ధర

సంవత్సరం	మద్దతు ధర
2018–2019	రూ.2,750
2019–2020	రూ.2,750
2020–2021	రూ.2,800
2021–2022	రూ.2,900
2022–2023	రూ.2,980
2023–2024	రూ.3,080

రేగిడి :

చెరకు సాగు చేస్తున్న రైతులకు సంకిలి ఈఐడీ ప్యారీ కర్మాగారం తీపి కబురు చెప్పింది. దసరా సందర్భంగా చెరకు క్రషింగ్‌కు ముహూర్తం నిర్ణయించింది. ఈ నెల 25 నుంచి క్రషింగ్ ప్రారంభించి, వచ్చే ఏడాది మార్చి నెలాఖరు వరకూ క్రషింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఒక్క విజయనగరం జిల్లాయే కాకుండా పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలోని చెరకు పంటను కూడా సేకరించి, రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించే ఏర్పాట్లు చేస్తుంది.

4.50 లక్షల టన్నుల క్రషింగ్ లక్ష్యం

సంకిలి ఈఐడీ ప్యారీ ఈ ఏడాది గతేడాది కంటే ఎక్కువగా చెరకు క్రషింగ్ లక్ష్యం చేసుకుంది. విజయనగరంతో పాటు పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలో రైతులు సాగు చేస్తున్న చెరకు పంట వివరాలు ఇదివరకే సేకరించింది. ఈ మూడు జిల్లాల్లో మొత్తం 7500 హెక్టార్లలో చెరకును రైతులు నుంచి సేకరించేందుకు కటింగ్ ఆర్డర్లు ఇస్తుంది. గతేడాది ఈ ఫ్యాక్టరీ ద్వారా 3.99 లక్షల టన్నుల చెరకును క్రషింగ్ చేయగా, ఈ ఏడాది 4.50 లక్షల టన్నుల చెరకును క్రషింగ్ చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు యాజమాన్యం వెల్లడించింది. ఇప్పటికే రైతులకు ఈ మేరకు కటింగ్ ఆర్డర్లు ఇస్తుంది. సకాలంలో బిల్లులు చెల్లించేందుకు కూడా ఏర్పాట్లు పూర్తి చేసింది.

మద్దతు ధర రూ.100ల పెంపు

గతేడాది కంటే ఈ ఏడాది చెరకు టన్ను మద్దతు ధర రూ.100లు ఈఐడీ పెంచింది. గతేడాది రూ.2980లు టన్ను మద్దతు ధర ఉండగా, ఈ ఏడాది రూ.3080లు చేసింది. ఎకరా సాగులో చెరకు పంటకు ఈ ఏడాది అనుకూల వాతావరణం ఉండడంతో 30 టన్నులు దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

సకాలంలో చెల్లింపులు

ప్యారీ కర్మాగారం చెరకు రైతును ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టింది. ఇప్పటివరకూ 2 వేల హెక్టార్లతో రైతులకు కటింగ్ ఆర్డర్లు సిద్ధం చేశాం. ఈ నెల 25 నుంచి చెరకు సేకరణ చేసి, క్రషింగ్ చేస్తాం. అంతేకాకుండా చెరకు మద్దతు ధర టన్నుకు రూ.2980లు కాగా మరో రూ.100లు అదనంగా ఫ్యాక్టరీ చెల్లిస్తుంది. చెరకు నాటే రైతులకు ముందుగా విత్తనాలు పంపిణీ, మధ్యలో ఎరువుల పంపిణీని కర్మాగారం చేపట్టింది. ఈ ఏడాది మూడు జిల్లాల పరిధిలో మొత్తం 9000 మంది రైతులు లబ్ధి పొందనున్నారు. చెరకు కర్మాగారానికి సరఫరా చేసిన 14 రోజుల్లోనే నేరుగా రైతు ఖాతాలోకే నగదును జమ చేస్తాం.

– పట్టాభి రామిరెడ్డి, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్, ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం, సంకిలి

నాగావళి నదిలో విద్యార్థి గల్లంతు



జి.అవినాష్(ఫైల్)



నది వద్ద గుమిగూడిన స్థానికులతో మాట్లాడుతున్న ఎస్ఐ లోకేశ్వరరావు

సంతకవిటి: స్నానానికి నదిలో దిగిన విద్యార్థి గంటా అవినాష్(21) గ ల్లంతైన ఘటన మండలంలోని తుమరాం గ్రా మం వద్ద ఆదివారం చో టుచేసుకుంది. రాజాం మున్సిపాలిటీ పరిధిలో ని అమ్మవారి కాలనీకి చెందిన అవినాష్ స్నేహితులతో క లిసి సరదాగా నదీ తీరానికి వెళ్లాడు. అక్కడ వారు కాసే పు ఆటపాటలతో గడిపిన తర్వాత నదిలో స్నానం చేసేందుకు దిగారు. ఈ క్రమంలో లోతైన ప్రాంతానికి అవినాష్ జారుకుని గల్లంతై ఉంటాడని అతడి స్నేహితులు చెబుతున్నారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది నదిలో దిగి, గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ బి.లోకేశ్వరరావు తెలిపారు.